నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
5 | కరీంనగర్, ఆదివారం 21 ఏప్రిల్ 2024 | PEDDAPALLI

## మూడో రోజు 16 నామినేషన్లు

**కరీంనగర్‌లో 3, పెద్దపల్లిలో 6, నిజామాబాద్‌లో 7 దాఖలు**

పెద్దపల్లి, ఏప్రిల్ 20(నమస్తే తెలంగాణ): మూడో రోజు శనివారం కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ ఎంపీ స్థానాలకు 16 నామినేషన్లు దాఖలయ్యాయి. కరీంనగర్‌లో మూడు, పెద్దపల్లిలో 6, నిజామాబాద్‌లో 7 వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. కరీంనగర్‌లో ఒకరు బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ కాగా, మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులుగా కోహెడ మండలం వెంకటేశ్వరపల్లికి చెందిన పినిశెట్టి రాజు, జమ్మికుంట గ్రామానికి చెందిన రాపోలు రాంకుమార్ భరద్వాజ్ తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి పమేలా సత్పతికి అందజేశారు. పెద్దపల్లిలో స్వతంత్ర అభ్యర్థులుగా గవ్వల శ్రీకాంత్, లింగాల లచ్చయ్య , మేకల అక్షయ్ కుమార్, జాడి ప్రేమ్ సాగర్, కాంగ్రెస్ తరపున కట్కూరి సందీప్, పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమోక్రటిక్) పార్టీ తరపున మోతె నరేశ్ ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజామ్మిల్ ఖాన్ తెలిపారు. నిజామాబాద్‌లో 7 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు.



# 'అకాల' నష్టం

వీర్నపల్లి మండలం రంగంపేటలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న మహిళా రైతు

- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల వర్షం
- అక్కడక్కడా ఈదురుగాలుల బీభత్సం
- కల్లాల్లో తడిసిన ధాన్యం
- నేలరాలిన మామిడి కాయలు
- ఆందోళనలో రైతులు



ఓదెల: నేల రాలిన మామిడికాయలను చూపుతున్న రైతు కుమారస్వామి

కథలాపూర్/ వీర్నపల్లి/ ఓదెల, ఏప్రిల్ 20, అకాల వర్షం రైతును అతలాకుతలం చేసింది. ఉమ్మడి జిల్లాలో శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం కురిసిన వాన అపార నష్టాన్ని తెచ్చిపెట్టింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులతో వర్షం పడింది. ప్రస్తుతం వరి కోతలు పూర్తవుతుండడంతో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించారు. ఈ సమయంలోనే పడిన అకాల వానతో ధాన్యం తడిసి రైతులు కన్నీరు పెడుతున్నారు. కథలాపూర్ మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో పలుచోట్ల ధాన్యం తడిసిపోగా.. అక్కడక్కడా టార్పాలిన్ కవర్లు కప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయిందని రైతులు వాపోతున్నారు. కేంద్రాలు ప్రారంభించి 20 రోజులవుతున్నా కొనుగోళ్లు చేపట్టకపోవడం వల్లే తమకీ కష్టాలు వచ్చాయని మండిపడుతున్నారు. వీర్నపల్లి మండలం రంగంపేట, లాల్‌సింగ్‌తండా, అడవిపదిర, బాబాయిచెరువుతండాలో ఈదురుగాలులతో వర్షం పడింది. కొనుగోలు కేంద్రాల్లో సుమారు 10వేల క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయింది. రంగంపేట సెంటర్‌లో వరదకు ధాన్యం కొట్టుకుపోయి జంపన్న చెరువులో కలిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని తహసీల్దార్ ఉమారాణి శనివారం పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదిస్తామని ఆమె తెలిపారు. ఇక ఓదెల మండలంలోని మామిడితోటల్లో కాయలు నేలరాలడంతో రైతులు నష్టపోయారు. కొందరు తోటలను లీజుకు తీసుకోగా, ఈదురుగాలుల కారణంగా కోలుకోలేని దెబ్బ తగలిందని వాపోతున్నారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



కార్యకర్తల మధ్య కేక్ కట్ చేస్తున్న పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

# ఇదేం పాలన ?

- నాలుగు నెలల్లోనే రాష్ట్రం అస్తవ్యస్తం
- పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, ఏప్రిల్ 20: 'ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చిన్రు. అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నీ గాలికొదిలేసిన్రు. అభివృద్ధిపై ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నరు? ఇదేం పాలన' అంటూ పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కాంగ్రెస్‌పై ఫైర్ అయ్యారు. నాలుగు నెలల కాంగ్రెస్ పరిపాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందని మండిపడ్డారు. శనివారం ఆయన పుట్టినరోజు సందర్భంగా ధర్మపురిలో బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. అనంతరం మాట్లాడారు. కేసీఆర్ పాలనలో కోటి ఇరవై లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని, రైతులు పుట్ల కొద్దీ ధాన్యం పండించారని చెప్పారు. పండిన ప్రతి గింజనూ కొని ఇబ్బందులు రాకుండా చూశామన్నారు. నాడు రాష్ట్రంలో ఫ్రెండ్లీ వాతావరణం ఉండేదని గుర్తు చేశారు. ప్రస్తుతం అభివృద్ధిపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ నేతలు భౌతిక దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. ఇది మంచి పద్ధతి కాదని, అధికారం ఉందని ఇష్టారాజ్యంగా ప్రవర్తించడం సరికాదని హితవు పలికారు. అంతకుముందు ధర్మపురి లక్ష్మీనర్సింహాస్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఇక్కడ మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్తెమ్మ, నాయకులు అయ్యోరీ రాజేశ్, చిలివేరి శ్యాంసుందర్ స్తంభంకాడి మహేశ్, రామచంద్ర గౌడ్, మహేశ్ ఉన్నారు.



మర్తనపేట గ్రామంలో రైస్‌మిల్లు నిర్వాహకుడిని నిలదీస్తున్న రైతులు

# ధాన్యం తూకంలో గోల్‌మాల్

- 16క్వింటాళ్లు తక్కువ చూపిన రైస్‌మిల్లు నిర్వాహకుడు
- రైతుకు అనుమానం వచ్చి నిలదీయడంతో తప్పు ఒప్పుకున్న వైనం
- ఆలస్యంగా వెలుగులోకి

కోనరావుపేట, ఏప్రిల్ 20: ధాన్యం తూకంలో ఓ రైస్‌మిల్లు నిర్వాహకుడు గోల్‌మాల్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు, స్థానిక రైతుల కథనం ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన ఎదుగట్ల మహేశ్ రెండ్రోజుల కింద వరి కోశాడు. కోసింది కోసినట్లే ధాన్యాన్ని విక్రయించేందుకు శుక్రవారం మర్తనపేట గ్రామంలోని సరస్వతీ రైస్ మిల్లుకు పంపించాడు. మొత్తం నాలుగు ట్రాక్టర్ల లోడ్ తరలించాడు. రైతు లెక్క ప్రకారం మొత్తం ధాన్యం 65 క్వింటాళ్ల తూకం రావాల్సి ఉంది. అయితే ఒక్కో ట్రాక్టర్ లోడ్ 17 క్వింటాళ్ల చొప్పున మొదటి రెండు లోడ్లు వెయిట్ రాగా, తర్వాత లోడ్ 10 క్వింటాళ్లు, చివరి లోడ్ కేవలం 5 క్వింటాళ్లు.. మొత్తంగా 49 క్వింటాళ్లు మాత్రమే తూకం వచ్చింది. ఆ మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌కు ట్రక్ షీట్లు ఇచ్చి పంపించగా, వాటిని చూసి రైతు కంగుతిన్నాడు. ప్రతి లోడ్‌లో ధాన్యాన్ని ఒకే మొత్తంలో పంపిస్తే తూకంలో తేడాలు ఎలా వచ్చాయని సదరు రైతు మరికొంత మంది రైతులతో కలిసి మిల్లు నిర్వాహకుడి వద్దకు వెళ్లి ప్రశ్నించారు. దీంతో చివరి రెండు లోడ్లలో ధాన్యం తక్కువగా వచ్చిందని, వచ్చింది వచ్చినట్లే తూకం వేసి ట్రక్ షీట్లు ఇచ్చానని మిల్లు నిర్వాహకుడు దురుసుగా మాట్లాడాడు. గోల్‌మాల్ ఎక్కడ జరిగిందో..? తెలుసుకునేందుకు శనివారం ఉదయం మర్తనపేట గ్రామ చౌరస్తాలో ఉన్న సీసీ పుటేజీని రైతులు పరిశీలించారు. అయితే ట్రాక్టర్ లోడ్‌లో ఎక్కడా తేడా లేదని, ఫుల్‌గానే ధాన్యం వచ్చినట్లు గుర్తించారు. నిర్వాహకుడి వద్దకు వెళ్లి గొడవ చేయడంతో అతడు సైతం పుటేజీ పరిశీలించి జరిగిన తప్పుఒప్పుకున్నాడు. మొత్తం 65 క్వింటాళ్ల ధాన్యాన్ని లెక్క చూపాడు. జరిగిన నష్టాన్ని భర్తీ చేశాడు. అయితే ఈ విషయం బయటికి రావడంతో మిగతా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇన్నాళ్లూ తామూ ఇలాగే మోసపోయి ఉంటామంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# గులాబీ జెండాతోనే అభివృద్ధి

- తెలంగాణపై కాంగ్రెస్, బీజేపీకి చిత్తశుద్ధి కరువు
- వీటి వ్యవహార శైలితోనే విద్యారంగం వెనుకడుగు
- ఆ రెండు పార్టీలకు చెంపపెట్టులా ఎన్నికలు
- నన్ను గెలిపిస్తే ప్రశ్నించే గొంతుకనవుతా
- కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్
- ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి సాదాసీదాగా నామినేషన్ దాఖలు



నామినేషన్ పత్రంతో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మైనార్టీ నాయకుడు జమీలొద్దీన్



ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతికి నామినేషన్ పత్రం అందజేస్తున్న వినోద్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్/ కలెక్టరేట్, ఏప్రిల్ 20 : గులాబీ జెండాతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్, బీజేపీ నాయకులకు చెంపపెట్టులాంటి తీర్పునిస్తారని జోస్యం చెప్పారు. ఆ రెండు పార్టీల పాలన చూసిన తెలంగాణ ప్రజలు తిరిగి బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ నాలుగు నెలల పాలన నాటి సమైక్యవాదుల తీరును గుర్తుకుతెస్తోందనే చర్చ ప్రజల్లో జరుగుతున్నదన్నారు. ఐదేళ్లు ఎంపీగా ఉన్న బండి సంజయ్ బీజేపీ పాలనలో కేంద్రం నుంచి జిల్లాకు తెచ్చిన నిధులు శూన్యమని విమర్శించారు. శనివారం ఆయన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా సాదాసీదాగా నామినేషన్ వేశారు. అంతకు ముందు నగరంలోని వరాహస్వామి దేవాలయంలో కుటుంబసభ్యులతో కలిసి నామినేషన్ పత్రాలు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత బీఆర్ఎస్ నాయకులతో తన నివాసానికి చేరుకొని శ్రేణులతో కలిసి మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మైనార్టీ నాయకుడు జమీలొద్దీన్‌తో కలిసి రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. నాడు తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న రోజుల్లోనూ కాంగ్రెస్, బీజేపీ టీఆర్ఎస్‌కు మోకాలడ్డాయని ఆరోపించారు. ఐదుగురు ఎంపీలతో తెలంగాణ తెస్తారా ? అంటూ వ్యంగ్యంగా మాట్లాడితే, యావత్ దేశాన్నే తెలంగాణ వైపు చూసేలా పోరాడామని గుర్తు చేశారు. 32 పార్టీలను ఏకం చేసి 28 పార్టీల నుంచి తెలంగాణ ఏర్పాటుకు అనుకూలంగా లేఖలు తెచ్చి, విమర్శకుల నోళ్లు మూయించామన్నారు. ఎన్నో పోరాటాలతో తెచ్చుకున్న తెలంగాణను అభివృద్ధి చేయడంపై కాంగ్రెస్, బీజేపీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఆ పార్టీల వ్యవహార శైలితోనే మన రాష్ట్రానికి రావాల్సిన విద్యా వనరులు దూరమయ్యాయని ధ్వజమెత్తారు. అటు నవోదయ విద్యాలయాలు రాలేదని, ఇటు వైద్య రంగంలో అత్యున్నతమైన ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సంస్థ కరీంనగర్ జిల్లాకు రాకుండా పోయిందని వాపోయారు. ఏయిమ్స్ ఏర్పాటుకు రేకుర్తి-కొత్తపల్లి మధ్య 50 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయిస్తున్నట్టు ప్రతిపాదనలతో ఢిల్లీకి వెళ్లి సంబంధితాధికారులకు అప్పగించామన్నారు. అయితే, అప్పటికే ఎన్నికల షెడ్యూల్ రావడం, తాను ఓటమి పాలు కావడంతో ఆ ప్రతిపాదనలు ముందుకు వెళ్లలేదని, అనంతరం గెలిచిన ఎంపీ కూడా పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం జిల్లాకో నవోదయ పాఠశాల రావాల్సి ఉన్నా ఇప్పటివరకు ఏర్పాటుకు అనుమతులు తేలేని దుస్థితి తెలంగాణ బీజేపీలో నెలకొందన్నారు. ఈ రెండు పార్టీల తీరుతోనే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందలేదని విమర్శించారు. అందుకే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో అన్ని సామాజిక వర్గాలకు అనువుగా గురుకులాలు ఏర్పాటు చేసి, విద్యారంగ పురోగతి కోసం పాటుపడినట్లు గుర్తు చేశారు. ఉద్యమకారులకు మాత్రమే తెలంగాణ అభివృద్ధిపై స్పృహ ఉంటుందనే ఆలోచన ప్రజల్లో వచ్చిందన్నారు. తనను గెలిపిస్తే కేంద్రంలో ఏపార్టీ అధికారంలో ఉన్నా పోరాడి నిధులు తెస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

### కాంగ్రెస్ మాటలు నీటి మూటలే

కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు నీటి మూటలే. నాలుగు వేల కోట్లతో మైనార్టీలకు నిధులు కేటాయిస్తామని చెప్పి, నాలుగు రూపాయలు కూడా విడుదల చేయలేదు. మైనార్టీ సబ్‌ప్లాన్ కూడా అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వమే మైనార్టీలకు పెద్దపీట వేసి, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. రాబోయే ఎన్నికల్లో హంగ్ వచ్చే అవకాశాలున్నట్లు మొదటి విడుత ఎన్నికలు స్పష్టం చేస్తున్నాయి. పార్లమెంటులో తెలంగాణ అభివృద్ధి కోసం గొంతుకగా మారే వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవాలి.

- మైనార్టీ నాయకుడు జమీలొద్దీన్

### కేంద్రంలో ఏ ప్రభుత్వమున్నా నిధులు తీసుకొస్తా

బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా పని చేయాలి. తప్పకుండా మనమే గెలుస్తం. తెలంగాణ కోసం ఆలోచించే వారు పార్లమెంట్‌లో ఉండాల్సిన అవసరమున్నది. నన్ను గెలిపిస్తే కరీంనగర్‌తోపాటు రాష్ట్ర సమస్యలపై పార్లమెంట్‌లో మాట్లాడుత. కేంద్రంలో ఏ ప్రభుత్వమున్నా నిధులు తీసుకొస్త. కరీంనగర్ పార్లమెంట్‌ను అభివృద్ధి చేస్త. హామీలు ఇచ్చుడే కాదు, వాటిని అమలు చేసి చూపిస్త. చెప్పినట్టే కేబుల్ బ్రిడ్జిని నిర్మించినం. మొన్నటిదాకా మానేరు రివర్ ఫ్రంట్ పనులు వేగంగా నడిచినయి. ఇప్పుడు ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిపోయినయి. నేను ఓడిపోవడంతో నవోదయ, ట్రిపుల్ ఐటీ పట్టించుకునే నాథుడు లేడు. ఇప్పుడు ఎంపీగా ఉన్న సంజయ్ వాటి గురించి ఏ రోజు కూడా మాట్లాడలేదు.

- బోయినపల్లి వినోద్ కుమార్

### మాట్లాడే గొంతుక అవసరం

తెలంగాణ ప్రయోజనాలు కాపాడడం బీఆర్ఎస్‌తోనే సాధ్యం. కేసీఆర్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలో ఒక్కొక్కటిగా అటకెక్కిస్తున్నది. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్న ఆ పార్టీపై రైతులు, సామాన్య ప్రజలు ఆగ్రహంతో ఉన్నరు. కరీంనగర్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుంది. మొదటి స్థానంలో బీఆర్ఎస్, రెండోస్థానంలో బీజేపీ ఉండబోతున్నది. కాంగ్రెస్ మూడో స్థానానికే పరిమితం కానున్నది. కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యంతో తెలంగాణలో పదేళ్లు వెనక్కు వెళ్లే పరిస్థితులు మొదలైనయి. మానేరు రివర్ ఫ్రంట్ పనులతోపాటు అనేక అభివృద్ధి పనులు మూలనపడ్డయి. వీటిని తిరిగి ప్రారంభించాలంటే మాట్లాడే గొంతుక అవసరం.

- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

### మొదట గెలిచే సీటు కరీంనగరే

రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల్లో మొట్టమొదటగా గెలువబోయే సీటు కరీంనగరే. వందకు నూటొక్క శాతం వినోద్‌కుమార్ గెలిచి, పార్లమెంటులో అడుగుపెడుతరు. ఇంగ్లిష్, హిందీ రాని బండి సంజయ్‌ని పార్లమెంటుకు పంపితే ఏం ప్రయోజనం ఉండదు. కేంద్రంలో బీజేపీం ప్రభుత్వం ఉన్నా ఆయన ఐదు కొత్తలు కూడా తేలే. దీనిని ప్రజలు గమనించాలి. అద్భుత వాగ్ధాటితో పార్లమెంటులో ఇక్కడ పరిస్థితులపై తన గొంతుకను వినిపించే వినోద్‌కుమార్‌ను గెలిపించాలి.

- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

### వినోద్ గెలుపు కోసం ఏకం కావాలి

అంబేద్కర్ స్ఫూర్తితో పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యలపై అనర్గళంగా మాట్లాడే వ్యక్తి వినోద్‌కుమార్. ఆయన ఎంపీగా గెలిస్తే కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి సాధ్యమైతది. పేదోళ్లకు పెరుగన్నంలా ఉండే వినోద్ గెలుపు కోసం బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఏకమై కృషి చేయాలి. ప్రస్తుత కరీంనగర్ ఎంపీ ఎన్నడు కూడా ఇక్కడి సమస్యలపై పార్లమెంటులో మాట్లాడిన పాపాన పోలేదు. కేవలం కులం, మతం పేరిట చిచ్చు పెడుతూ, దేవుడి పేరిట రాజకీయం చేయడం తప్ప చేసిందేమీ లేదు. ఐదేళ్లకోసారి వేసే అడ్వర్టైజ్ మెంట్ పేపర్‌లాగా సంజయ్ మారిండు. ఏ ఒక్కనాడు కూడా ప్రజల వద్దకు వెళ్ళిన దాఖలాలు లేవు. ఆయనను ప్రజలు గుర్తు పట్టే పరిస్థితిలో లేరు. కాంగ్రెస్ అబద్ధపు హామీలతో మోసం చేసింది. 60 లక్షల పైచిలుకు ఉన్న మాదిగలకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదు. కనీసం పార్లమెంటులో పోటీ చేసే అవకాశం కూడా కల్పించలేదు.

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



వినోద్‌కుమార్‌కు ₹25 వేలు అందజేస్తున్న బీఆర్ఎస్ మేడిపల్లి మండలాధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి

## నామినేషన్ ఖర్చులకు ₹25 వేలు అందజేత

మేడిపల్లి, ఏప్రిల్ 20 : కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు నామినేషన్ ఖర్చుల కోసం జగిత్యాల జిల్లా మేడిపల్లి, భీమారం మండలాల బీఆర్ఎస్ పార్టీ తరపున మేడిపల్లి మండలాధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి శనివారం ₹25 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు, మాజీ జడ్పీటీసీ నెల్లుట్ల పూర్ణిమ, ప్రభాకర్ పాల్గొన్నారు.

# ఎన్నికల విధులెక్కడో ఓటూ అక్కడే..

పార్లమెంట్ పోరు సమీపిస్తున్న వేళ ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగుల కోసం ఈసీ సరికొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో పని చేసే చోటే ఓటు వేసుకునే వెసులుబాటు కల్పించింది. అది కూడా ఉద్యోగుల ఓటు ఉన్న పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో డ్యూటీ చేసే వారికి మాత్రమే అవకాశం ఇచ్చింది. లోక్‌సభ పరిధి దాటితే మాత్రం ఎప్పటిలాగే పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాల్సి ఉండగా, నూతన పద్ధతితో కరీంనగర్ జిల్లాలో వేలాది మందికి ప్రయోజనం కలుగనున్నది.




- పోస్టల్ బ్యాలెట్లలో ఇబ్బందుల నేపథ్యంలో ఈసీ సరికొత్త నిర్ణయం
- ఈడీసీ ద్వారా వేసుకునే వెసులుబాటు
- ఒకే సెగ్మెంట్లో విధులు నిర్వహించే వారికే అవకాశం
- వేలాది మందికి ప్రయోజనం

కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 20: ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు ఇప్పటివరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునేవారు. అందుకోసం ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేసేది. ఈసీ నిర్ణయించిన తేదీల్లో మాత్రమే సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసే ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేసేవారు. అయితే, కొద్ది రోజులు మాత్రమే అవకాశమివ్వడంతో రోజూ వేలాది మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసేందుకు ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద బారులు తీరేవారు. ఓపిక లేని వారు తమ ఓటు వేయకుండానే వెనుదిరిగేవారు. ఇలా వేల సంఖ్యలో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా కూడా ఓటు వేయలేకపోతున్నట్లుగా గుర్తించిన ఈసీ, ఈసారి విధులు నిర్వర్తించే చోటనే ఓటు వేసే విధానానికి రూపకల్పన చేసింది. ఇలా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే సిబ్బంది ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్(ఈడీసీ)తో ముందుగా ఫామ్-12ఏ భర్తీ చేసి సంబంధిత పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏఆర్‌వోకు నిర్ణీత గడువులోపు అందజేయాల్సి ఉంటుంది. తాము నిర్వహించబోయే ఎన్నికల విధుల వివరాలు, ఓటు హక్కు కలిగి ఉన్న శాసనసభా నియోజకవర్గం, గ్రామం, పట్టణం ఓటరు జాబితాలో తమ ఓటు వరుస సంఖ్య, తదితర విషయాలు స్పష్టంగా రాయాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించి ఎన్నికల రిటర్నింగ్ అధికారి సిబ్బంది తమ ఓటు వినియోగించుకునేందుకు అనుమతిస్తారని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కే మహేశ్వర్ తెలిపారు.

### పరిధి దాటితే పోస్టల్ బ్యాలెటే

పార్లమెంట్ పరిధిలో ఎన్నికల విధులు, ఓటు హక్కు ఉన్న వారు పనిచేసేచోటనే ఓటు హక్కు కల్పిస్తుండగా, లోక్‌సభ పరిధి దాటితే పోస్టల్ బ్యాలెట్ ద్వారా మాత్రమే తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. అందుకోసం కూడా ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఫామ్ 12బీ ద్వారా అనుమతి కోరాల్సి ఉంటుంది. వీటిని ఆయా మండల కేంద్రాలు, సిబ్బందికి అందించే శిక్షణ సమయంలో స్వీకరించి, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించనున్నారు. కరీంనగర్ పార్లమెంటు పరిధిలో మొత్తం 200 పై చిలుకు సెక్టోరల్ అధికారులు, 8వేల పైచిలుకు పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు ఉన్నారు. వీరిలో అత్యధిక మంది కరీంనగర్ పార్లమెంటు పరిధిలోనే విధులు నిర్వహించే అవకాశముండగా, వీరందరికీ వారు విధులు నిర్వహించబోయే పోలింగ్ కేంద్రాల్లోనే ఓటు వేసే అవకాశం కల్పించేందుకు యత్నిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు.

# హెచ్‌ఎం సస్పెన్షన్

- వరంగల్ ఆర్జేడీ ఉత్తర్వులు
- నిధులు దుర్వినియోగం ఫలితం

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 20 : తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పీ రాజభాను చంద్రప్రకాశ్‌ను సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కే సత్యనారాయణరెడ్డి శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎల్‌ఎండీ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో జరిగిన పలు లావాదేవీలలో అవినీతికి పాల్పడి, ఉపాధ్యాయుల వేతనాలు, వారికి రావాల్సిన నిధులు తన సొంతానికి వాడుకున్నట్లు పలువురు ఉపాధ్యాయులు డీఈవోతోపాటు, ఆర్జేడీకి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సైతం ఆ ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగా అధికారులు విచారణ జరిపి, ఆ ఆరోపణలు వాస్తవమని నివేదిక ఇవ్వడంతో ఆ హెచ్‌ఎంపై చర్యలు తీసుకున్నారు.